

పక్కాగా డాక్యుమెంట్ల విచారణ: సబ్ కలెక్టర్

పార్వతీపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారించాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. శుక్రవారం గోపాల పురంలో రీసర్వే పనులను పరిశీలించారు. రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా రైతులకు సమాచారం అందించాలన్నారు. తప్పనిసరిగా రశీదులు పొందాలని సూచించారు. భూ సర్వేలో తలెత్తిన లోపాలను భూ యజమానికి నోటీసు ద్వారా తెలియపర్చాలన్నారు. రీసర్వేలో లోపాలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు.

సిబ్బంది కొరత..

- ఇదీ జిల్లాలో పశు సంవర్థక శాఖ పరిస్థితి..
- శిథిలావస్థలో భవనాలు 28.. మరమ్మతులకు గురైనవి 41
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు
- మూగ జీవాలకు పూర్తిస్థాయిలో అందని సేవలు
- ఇబ్బందుల్లో పాడి రైతులు
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వసతి కరువు



శిథిలావస్థలో చినమేరంగి పశు వైద్యశాల

జియ్యమ్మవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశు సంవర్థకశాఖ పరిస్థితి దయనీయంగా మారింది. వసతి సమస్య, వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. మొత్తంగా 80 పశు వైద్యశాలల భవనాల్లో 41 రిపేర్లలో ఉంటే, 28 కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. మరోవైపు అదనపు పనిభారంతో తీవ్ర ఒత్తిడికి లోన వుతున్నారు. మరోవైపు మూగజీవాలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. దీంతో అత్యవసర వేళల్లో పాడిరైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం పశు వైద్యశాలల బలోపేతానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సచివాలయాల్లో సిబ్బంది తప్పితే.. వైద్యశాలల్లో పోస్టుల భర్తీని పూర్తిగా మరిచింది. దీంతో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని 15 మండలాల్లో గరుగుబిల్లి, కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సీతానగరం, సీతంపేట, సాలూరులో పశు వైద్యశాలలు ఉన్నాయి. పశు వైద్య చికిత్సాలయాలు 38, గ్రామీణ పశువుల యూనిట్లు 35 ఉన్నాయి. వాటి పరిధిలో ఆవులు 2.29 లక్షలు, గేదెలు 47 వేలు, గొర్రెలు 2.07 లక్షలు, మేకలు 1.73 లక్షలు, కోళ్లు 8.11 లక్షలు ఉన్నట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.

భవనాలు ఇలా..

- జిల్లాలో ఉన్న ఏడు పశు వైద్యశాలల్లో గరుగుబిల్లి, కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సీతానగరం పశు వైద్యశాలలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సీతంపేట పశు వైద్యశాల మరమ్మతులకు గురైంది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పశు వైద్యశాలలు 38 ఉండగా వాటిలో ఉల్లిభద్ర, నాగూరు, జియ్యమ్మవలస, చినమేరంగి, తుమరాడ, గంగిరేగువలస, ఎమ్మార్ నగరం, విశ్వనాథపురం, శంబర, పొల్ల, భామిని, బత్తిలి, బర్లి, చిలకలపల్లిలో ఉన్న 14 భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.
- నర్సిపురం, తాళ్లబురిడి, మాదలింగి, కొమరాడ, పాచిపెంట, పాంచాలి, మామిడిపల్లి, బాగువలస, దోను బాయి, పెదగొత్తిలి, గుమ్మ, గొరడ, సీఎం పురం, చినబగ్గ, బీడీ వలస, ఎం.సింగుపురం, తూడి, బలిజిపేటలో ఉన్న 18 పశు వైద్య చికిత్సాలయాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు.
- గ్రామీణ పశువుల యూనిట్లు (ఆర్ఎల్ యూ)35 ఉన్నాయి. వీటిలో బాసకారు, వండవ, కడకెళ్ల, కంబర, కత్తులకవిటి, పెదబోరబంద, గుచ్చిమి, గళావల్లి, పలగర పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మొండెంఖల్, రావివలస, మండ, కేధారిపురం, తాడికొండ, ఆమిటి, నీలా నగరం, తలవరం, చిట్టిపూడివలస, దశుమంతపురం, తోణాం, కన్నంపేట, తూరు మామిడి, కాశీపట్నం, వైఎస్ వలస, మార్కొండపుట్టి, హడ్డుబంగి, బూర్జ, కేఎస్ పురం, పెదపెంకిలో ఉన్న యూనిట్లు పూర్తిగా పాడయ్యాయి.

సిబ్బంది కొరత

- జిల్లాలో ఏడు పశు వైద్యశాలలు ఉన్నాయి. అయితే వాటిల్లో గరుగుబిల్లి మినహా ఆరుచోట్ల పశు సంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు ఉన్నారు.
- జిల్లాలో 38 పశు వైద్య చికిత్సాలయాలకు 38 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఉండాలి. కానీ 18 మంది మాత్రమే ఉన్నారు. బాగువలస, తుమరాడ, బగ్గ, విశ్వనాథపురం, నాగూరు, భామిని, బత్తిలి, తాళ్లబురిడి, మాదలింగి, బలిజిపేట, బగ్గందొర వలస, గంగిరేగువలస, చిలకలపల్లి, చినమేరంగి, గుమ్మ, శంబర, భద్రగిరి, ఎం.సింగుపురం, బిటివాడ, తూడిలో ఉన్న పశు వైద్య చికిత్సాలయాలకు డాక్టర్లు లేరు.
- బూర్జ రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్‌కు వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ లేరు.
- పాలకొండ, గరుగుబిల్లి, కురుపాంలోని పశు వైద్యశాలలతో పాటు తాడికొండ, కేధారిపురం రూరల్ యూనిట్లలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు లేరు.
- భద్రగిరి, చినమేరంగి, ఉల్లిభద్ర, పాచిపెంట, విశ్వనాథపురం, కొమరాడ, పెదబొండపల్లి,



కూలేందుకు సిద్ధంగా ఉన్న కురుపాం పశు వైద్యశాల

(మిగతా 8వ పేజీలో...)

అర్జీలు పునరావృతం కారాదు: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలు పునరావృతం కారాదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించగా.. మిగిలిన వాటిని పీజీఆర్ఎస్ కిందకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో హేమలత, డీసీహెచ్‌వో వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఫైలేరియా నివారణ కార్యక్రమం

వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న ఫైలేరియా నివారణ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. గత ఏడాది నవంబరులో నిర్వహించిన సర్వేలో బలిజిపేట మండలంలో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నట్టు తేలిందన్నారు. వైద్యాధికారులు బృందాలుగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మందులను పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, నోడల్ అధికారి వినోద్‌కుమార్, డీపీవో కొండలరావు తదితరులున్నారు.

నిమ్మగడ్డిని పండించాలి..

జిల్లాలో సుగంధ ద్రవ్యాల నిమ్మగడ్డిని పండించాలని కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పిలుపునిచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో రైతులు సాగుచేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రైతులకు రెండు విడతల్లో 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఒక ఎకరాకు సుమారు 50 వేలు మొక్కలు నాటాల్సి ఉంటుందన్నారు. మొక్కల కొనుగోలుకు రూ.20 వేలు ఖర్చు కాగా, అందులో గిరిజన రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు.బీసీ, ఎస్సీ, ఇతర కేటగిరీల రైతులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగన వారు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

వైభవంగా పోలమాంబ
ఉత్సవం జరపాలి
- మంత్రి సంధ్యారాణి 6లో

మోసగాళ్లతో జాగ్రత్త
- ఆన్‌లైన్ కేటుగాళ్ల వలలో పడొద్దు
- డిజిటల్ ప్రపంచంలో పెరిగిపోతున్న నేరాలు
- అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

తోటపల్లికి చేరిన విగ్రహాలు
- ప్రతిష్ఠకు ఏర్పాట్లు 6లో

పరాక్రమానికి మారుపేరు
బొబ్బిలి యుద్ధం
- ఎమ్మెల్యే బేబీనాయన
- తాండ్రపాపారాయుడికి ఘన నివాళి

రక్తహీనత నివారణకు చర్యలు

- స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్ చిన్మయదేవి

గరుగుబిల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపడుతున్నామని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్ (విశాఖ) చిన్మయదేవి తెలిపారు. శుక్రవారం ఉల్లిభద్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ... పూర్తిస్థాయిలో పౌష్టికాహారాన్ని అందించా లన్నారు. సక్రమంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాఖ, అంగన్‌వాడీలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సామగ్రి వివరాలు విధిగా రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. కేంద్రాల ఆవరణలో కాయగూరలు పండించాలని తెలిపారు. ప్రతి నెలా 5న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకో వాలన్నారు. చిన్నారులకు మెరుగైన బోధన అందించాలన్నారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, కార్యకర్తలు ఎం.కల్పన, ఎస్.లావణ్య తదితరులు ఉన్నారు.



ఉల్లిభద్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

వైద్య శిబిరాలు సక్రమంగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

మక్కువ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతర నేపథ్యంలో వైద్య శిబిరాలు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన శంబరలో పర్యటించారు. గ్రామంలోని వీధుల్లో యాంటీ లార్వా స్ప్రే చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. జాతర సందర్భంగా వీలైనంత ఎక్కువగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 108, 104, ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేశారు. భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత మక్కువ పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్, వైద్యాధికారులు ఎం.వి.కిరణ్‌కుమార్, రమ్యసాయి పాల్గొన్నారు.

పూర్తయ్యేదెప్పుడు?

- నత్తనడకన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం
- ఇబ్బందుల్లో జిల్లావాసులు

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా.. పనులు తుది దశకు చేరుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా గత వైసీపీ సర్కారు హయాంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలను ప్రారంభించారు. ఇకపై జిల్లావాసులు వైద్య సేవల కోసం పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పారు. అయితే ఐదేళ్లలో 50 శాతానికి మించి పనులు జరగలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం తదితర కారణాలతో నిర్మాణాలు కొలిక్కి రాలేదు. దీంతో జిల్లావాసులకు నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు ఆసుపత్రుల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. అయినప్పటికీ పనులు ఊపందుకోవడం లేదు. పార్వతీపురం, సీతంపేటలో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఇదిలా ఉండగా పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గుండె, కిడ్నీ వైద్య నిపుణుల పోస్టులు భర్తీ కాలేదు. దీంతో అత్యవసర వేళల్లో జిల్లా వాసులు విశాఖపట్నం లేదా విజయనగరానికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేసి.. పూర్తిస్థాయిలో వైద్య నిపుణుల పోస్టులను భర్తీ చేస్తే జిల్లా ప్రజలు ముఖ్యంగా గిరిజనులకు ఇబ్బందులు తప్పుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని 'మన్యం' వాసులు కోరుతున్నారు.



పార్వతీపురంలో ఆసుపత్రి భవన నిర్మాణాలు ఇలా..

18 ఇసుక వాహనాలు సీజ్

పాలకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం సమీపంలో నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 18 వాహనాలను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సీజ్ చేశారు. శుక్రవారం ఆ ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో ర్యాంప్‌లో 12 ట్రాక్టర్లు, ఆరు లారీలు ఉన్నట్టు ఆయన గుర్తించారు. రెండు ఎక్సకవేటర్ల ద్వారా ఇసుకను లోడ్ చేస్తున్నట్టు గమనించారు. వెంటనే ఆయా వాహనాలను సీజ్ చేసి పాలకొండ ఎస్ఐ ప్రయోగమూర్తి, డీటీ సన్యాసిరావులకు అప్పగించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఉపాధిలో అవకతవకలు

- సామాజిక తనిఖీలో బయటపడిన వైనం
- పని వద్ద కనిపించని నేమ్ బోర్డులు
- మస్తర్లపై సంతకాలు లేకుండానే పేమెంట్లు

జియ్యమ్మవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023- 24లో జరిగిన ఉపాధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయి. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్య జరిగిన 2,593 ఉపాధి పనులకు వేతనాలు, మెటీరియల్ రూపంలో రూ. 23.20కోట్లు, 23 పీఆర్ శాఖ పనులకు రూ. 2.23కోట్లు, 13 ఐటీడీఏ పనులకు రూ. 5.18కోట్లు వెచ్చించినట్లు సామాజిక తనిఖీ బృందం అధికారులు తెలిపారు. కాగా ఉపాధి హామీ పథకంలో వలంటీర్లకు మూడు రోజులకు బదులు వారం రోజుల పాటు పనులు కల్పించి 15 పంచా యతీలలో బిల్లులు చెల్లించినట్లు నిర్ధారణ అయింది. శిఖబడి పంచాయతీలో చనిపోయిన వారి పేర బిల్లులు చెల్లించారు. 20 పంచాయతీలలో మస్తర్లపై సంతకాలు , వేలి ముద్రలు లేకుండానే పేమెంట్లు చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. ఏజెన్సీ పంచాయతీల్లో స్టోన్ బండ్ ప్లాంట్లు, ఫారం పాండ్ల పనుల్లో కొలతల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. దాదాపు అన్ని పంచాయతీల్లో పనివద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా సుమారు రూ. 9 లక్షలు వరకు డ్రా చేశారు. అయితే తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేశామని క్షేత్ర, సాంకేతిక సహాయకులు అధికారుల ముందు చెప్పారు. అల్లువాడ, కుదమ, చినబుడ్డిడి పంచాయతీల్లో బినామీల పేర బిల్లులు చెల్లించి కొంతమొత్తం వసూలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. కాగా మొత్తం అవకతవకలపై పూర్తి నివేదిక ఇంకా రావలసి ఉంది. వాటిపై పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సురేష్ ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎన్.రమేష్‌రామన్, ఏపీడీ శ్రీహరిరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ, ఎంపీడీవో రమేష్, ఏపీవో కె.శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.




సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పంచాయతీ భవన నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్

- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

గరుగుబిల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. నూతన భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా 'మన్యం'లో 12 మండలాల పరిధిలో 68 భవనాల నిర్మాణాలకు రూ. 816 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు అంచనాలు రూపొందించాలని పార్వతీపురం, పాలకొండ ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ఉపాధి కింద రూ. 12 లక్షలు, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ)కింద రూ. 20 లక్షలు కేటాయించనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులతో భామిని మండలంలో 7, గుమ్మలక్ష్మీపురంలో ఒకటి, గరుగుబిల్లిలో 8, కొమరాడలో 3, జియ్యమ్మవలసలో 4, కురుపాంలో 5, మక్కువలో ఒకటి, పాచిపెంటలో 9, సాలూరులో 8, సీతంపేటలో 10, సీతానగరంలో 5, వీరఘట్టంలో 7 చొప్పున భవనాలను నిర్మించనున్నారు. పంచాయతీల్లో భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలు, మండల పంచాయతీ విస్తరణాధికారులకు సమాచారం అందించామని డీపీవో టి.కొండలరావు తెలిపారు. నిర్దేశించిన సమయంలోగా నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే జిల్లాలో భవనాలు లేని వాటిని గుర్తించి నివేదికలు అందించామని, పంచాయతీలకు భవన సమస్య తీరనుందని చెప్పారు.



ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్న కొంకడివరం పంచాయతీ భవనం


గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ భవనాలపైనే దృష్టి సారించింది తప్ప భవనాలు లేని పంచాయతీలపై దృష్టి సారించలేదు. దీంతో అధికంగా పాఠశాలలు, రామ మందిరాలు, అద్దె భవనాల్లోనే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమావేశాలు నిర్వహించారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మోసగాళ్లతో జాగ్రత్త

- ఆన్‌లైన్ కేటుగాళ్ల వలలో పడొద్దు
- డిజిటల్ ప్రపంచంలో పెరిగిపోతున్న నేరాలు
- జాగ్రత్తలతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

రాజాం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరులో రాజాం తెలగా వీధికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ నేరగాళ్ల వలలో పడి రూ.7.50 లక్షలు పోగొట్టుకున్నాడు. గత ఏడాది డిసెంబరు ఆఖరి వారంలో పట్టణంలోని డోలపేట ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిదీ అదే పరిస్థితి. రూ.20 లక్షలు రుణం ఇప్పిస్తామని చెప్పి రూ.8.95లక్షలకు టోకరా వేశారు. ఈ కేసు విషయంలో రాజాం పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త పడాలే తప్ప.. వారికి చిక్కితే ఒక్క రూపాయి కూడా వెనక్కి రాదన్న విషయాన్ని గమనించాలి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లు ఏయే రూపాల్లో మోసం చేసే ప్రయత్నం చేస్తారో తెలుసుకుందాం.



మోసగాళ్ల పన్నాగాలివే..

గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి పేరు, ఫోన్ నెంబర్.. ఇలా మీ వివరాలు ధ్రువీకరించాలని ఒత్తిడి చేస్తారు. ఇలాంటి వాటికి స్పందించవద్దు. అవసరమైతే అలాంటి నెంబర్లను బ్లాక్ చేయాలి. డిజిటల్ ప్రపంచంలో మీ అడ్రస్, స్థానం, ఫోన్, ఆధార్, పాన్, పుట్టిన తేదీ వంటి వ్యక్తిగత సమాచారం బయట వ్యక్తులతో షేర్ చేయకూడదన్న విషయాన్ని గమనించాలి.

ఆధార్ విషయంలో..

పోలీసులు సహా ఏ ఇతర అధికారులూ ఫోన్‌లో ఆధార్‌కు సంబంధించిన సమాచారాన్ని అడగరన్న విషయం తెలుసుకోవాల్సి ఉంది. ఆధార్ సంబంధిత ఏ ఇతర సమాచారం కూడా తెలియని వ్యక్తులు, సమూహాలతో చర్చించవద్దు. అలా ఎవరైనా అదేపనిగా కాల్స్ చేస్తుంటే అది ఆన్‌లైన్ నేరగాడి నుంచేనని గుర్తించాలి.

ట్రాయ్ ఫోన్ కాల్..

ట్రాయ్ మీ ఫోన్ నెంబర్‌ను డిస్కనెక్ట్ చేయబోతోందని కాల్ చేసే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి ట్రాయ్ నుంచి అలాంటి కాల్స్ వచ్చే అవకాశాలే లేవు. ఫోన్ నెంబర్ కట్ చేసే విధానం ప్రస్తుతం లేదు. బ్యాలెన్స్ లేకపోయినా ఇన్‌కమింగ్ కాల్స్ ఓటీపీలు రావు తప్ప మూడు నెలల వరకూ ఫోన్ నెంబర్ రద్దవదన్నది వాస్తవం.

డెలివరీ యాప్ నుంచి..

డెలివరీ యాప్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి మీ అడ్రస్, నిర్ధారించుకునేందుకు ఏదైనా నెంబర్ నొక్కాలని సున్నితంగా కోరడం సహజంగా మారింది. పని ఒత్తిడిలో ఉంటూ కాల్‌చేసిన వారు చెప్పిన విధంగా చేయవద్దు. ఆర్థికంగా నష్టపోవద్దు.

ఇ-కామర్స్ ఆర్డర్ రద్దు..

ఎవరైనా కాల్‌చేసి మీ పేరుమీద మీరు ఆర్డర్ చేయని పార్శిల్ ఉందని చెప్పి ఓటీపీ అడిగినా, లేదా ఆర్డర్‌ను రద్దు చేయడానికి లింక్‌ను తెరవమని అడిగినా స్పందించవద్దు. వారి మాయలో పడొద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లో మీకు తెలియని వ్యక్తులతో మీ ఓటీపీని షేర్ చేయవద్దు.

వీడియో కాల్స్

తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌కు ఆన్సర్ చేయవద్దు. మహిళల నగ్న వీడియోలతో వచ్చే కాల్స్ వైపు కన్నెత్తి చూడవద్దు. పొరపాటున వారి మాయలో పడితే లక్షల్లో నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి మోసాలకు గురై... ప్రాణాలు కోల్పోయిన వారూ ఉన్నారన్న విషయాన్ని మరచిపోవద్దు.

ఫెడెక్స్ కాల్..

ఫెడెక్స్ ద్వారా మీ ప్యాకేజి గురించి కాల్ చేస్తున్నామని చెప్పి ఏదైనా నెంబర్ నొక్కాలని కోరితే.. అలా చేయవద్దు.

తెలియని లింకులు...

నీలం రంగులో వచ్చిన తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దు. అలాగే మీరు డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారని భయపెట్టినా తేలిగ్గా తీసుకోవాలి. వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పరిచయాలను త్వరితగతిన నమ్మవద్దు. తెలియని పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలి.

డ్రగ్స్ దొరికాయని చెబుతూ..

మీకు వచ్చిన పార్శిల్‌లో లేదా మీరు పంపిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసగాళ్లు కాల్స్ చేసి బెదిరిస్తున్నారు. మీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని... అలా చేయకుండా ఉండాలంటే కొంత మొత్తం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి కాల్స్‌కు స్పందించ వద్దు.

బ్యాంక్ నుంచి ఫోన్ పేరుతో...

తాము ఫలానా బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని ఎవరైనా కేవైసీ అప్డేట్, ఏటీఎం బ్లాక్‌లో ఉందని లేదా ఇతర బ్యాంకు సేవల గురించి మాట్లాడుతూ ఏదైనా లింక్‌ను క్లిక్ చేయమని, ఓటీపీ అడుగుతారు. వీటికి స్పందించవద్దు. సాధారణంగా బ్యాంకుల సిబ్బంది ఇలాంటి సమాచారాన్ని ఫోన్‌లో అడగరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

పొరపాటున పంపిన డబ్బు విషయంలో..

ఎవరైనా మీకు కాల్ చేసి పొరపాటున మీ యూపీఐ ఐడీకి డబ్బు పంపించామని, తిరిగి ఆ మొత్తాన్ని పంపించాలని అడిగితే స్పందించి... చేతులు కాల్చుకోవద్దు.

ప్రభుత్వ నోటీసులు..

అత్యున్నత స్థాయిలో ఉన్న పోలీసు అధికారులు, సి.బి.ఐ., ఈడీ, ఐటీ విభాగాల నుంచి నోటీసులు వచ్చిన సందర్భాలలో తక్షణమే స్పందించవద్దు. సంబంధిత అధికారులతో నోటీసుల విషయం ధ్రువీకరించుకోవాలి.

చివరిగా..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే మీరు వారి బారిన పడి చిక్కుకుపోయినట్లయితే.. మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తుంటే.. ఎలాంటి సంకోచం లేకుండా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయండి. లేదా మోసగాడు మిమ్మల్ని నిలువునా దోచేస్తాడు.



అంగరంగ వైభవంగా పోలమాంబ ఉత్సవం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల ఆరాధ్య దేవత, ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ఉత్సవ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా నైదాన తిరుపతిరావును నియమించారు. సభ్యులుగా అక్కేన గణపతిరావు, జన్ని భాస్కరరావు, రెడ్డి వెంకటరమణ, గొట్టాపు భవాని, పురి నారయణ, వెలగాడ రాజమాణిక్యం, సన్నాయిల సత్తెమ్మ, గొల్లపల్లి లలితలను నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పెద్దలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాన్ని నిర్వహించాలని సూచించారు.

గిరిజన రహదారులకు రూ.270 కోట్లు..

పాచిపెంట/ సాలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలలో రహదారుల సౌకర్యార్థం ప్రధానమంత్రి జనమన్ కింద రాష్ట్రానికి రూ.270 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సరాయివలస గ్రామ సమీపంలో గల కొండ వాగుల గెడ్డల వద్ద రెండు వంతెనల నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వీటితో పాటు 1.2 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నిర్మాణ పనులకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.2 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ముఖి సూర్యనారాయణ, కొత్తల పోలినాయుడు, గూడేపు యుగంధర్, కొరిపల్లి సురేష్, చల్లా కనకబాబు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

పాచిపెంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో ఆమె 6 లక్షల 250 చేప పిల్లలను విడిచిపెట్టారు. చేప పిల్లలు పెరిగినంత వరకు వేట చేయవద్దని మత్స్యకారులకు సూచించారు. ఫిషరీస్ ఏడీ తిరుపతిరావు, ఎఫ్‌డీవో వై.శ్రీదేవి, అధికారులు, మత్స్యకారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యువహో!



- ఓటు నమోదులో యువత ముందడుగు
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు నమోదులో జిల్లా యువత ముందు వరుసలో ఉంది. 29 నుంచి 49 ఏళ్ల మధ్య వయసు గల ఓటర్లు జిల్లాలో అత్యధికంగా ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా విలువైనది. ప్రభుత్వాలు, పాలకులను మార్పు చేసే శక్తి ఓటుకే సాధ్యం. అటువంటి విలువైన ఓటును వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరు పై ఉంది. దీనికి ముందు అర్హులైన వారంతా ఓటరుగా నమోదు కావలసిన అవసరం ఉంది. ఈ క్రమంలో యువత ఓటు నమోదుకు ముందుకు వస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామం. శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆ విశేషాలు తెలుసుకుందాం.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం ఓటర్లు
రాజాం	1,11,773	1,113,228	16	2,28,017
బొబ్బిలి	1,14,493	1,17,320	9	2,31,822
చీపురుపల్లి	1,02,753	1,02,999	9	2,05,761
గజపతినగరం	1,00,943	1,04,838	4	2,05,785
నెల్లిమర్ల	1,05,806	108188	3	2,13,997
విజయనగరం	1,25,325	1,32,957	28	2,58,310
ఎస్.కోట	1,08300	1,14,444	2	2,22,746
మొత్తం	7,72,393	7,93,974	71	15,66,438

ఓటర్ల దినోత్సవం ఇలా..

1962లో మొదటి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. 1989లో రాజ్యాంగంలోని 326వ అధికరణానికి చేసిన సవరణలో ఓటు హక్కు పొందేందుకు కనీస వయస్సు 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గిస్తూ చట్టం చేశారు. 1993లో ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో ఏటా ప్రత్యేకంగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సీనియర్ ఓటర్లను సన్మానించనున్నారు. ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ రాష్ట్ర స్థాయిలో పురస్కారాలను అందుకోనున్నారు. అలాగే రాజాం తహసీల్దారు కృష్ణంరాజు, నెల్లిమర్ల నియోజకవర్గంలో ఇద్దరు బీఎల్‌వోలు అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి శనివారం విజయవాడలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేయనున్నారు.

జిల్లాలో ఓటర్లు...

జిల్లాలో మొత్తం 15,66,438 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,72,393 మంది, మహిళలు 7,93,974 మంది. థర్డ్ జెండర్ 71 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలు 21,581 మంది అధికంగా ఉన్నారు. విజయనగరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,58,310 మంది ఓటర్లు ఉండగా... అత్యల్పంగా చీపురుపల్లి నియోజకవర్గంలో 2,05,761 మంది ఉన్నారు. జిల్లాలో రాజాం తప్ప మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. రాజాం నియోజకవర్గంలో మహిళలు 1,13,228 మంది ఉండగా, పురుషులు 1,14,773 మంది ఉన్నారు.

వయస్సుల వారీగా...

వయస్సు	ఓటర్లు
18-19	20,611
20-29	2,44,301
30-39	3,92,083
40-49	3,66,401
50-59	2,63,722
60-69	1,72,225
70-79	85,096
80+	22,990

దరఖాస్తులు ఇలా...

- ఫారం 6: ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలన్న వ్యక్తి ప్రతి క్లెయిమ్‌పై సంతకం చేయాలి. ఈ ఫారంతో పాటు దరఖాస్తుదారుడు తన ఫొటోను అతికించాలి.
- ఫారం 7: ఓటర్ల జాబితాలో పేరు తొలగించాలని కోరుతూ ఇచ్చే దరఖాస్తు.
- ఫారం 8: ఓటరు జాబితాలో ఉన్న వివరాల్లో దిద్దుబాటు లేదా ఫొటోలు మార్పు చేయడానికి వినియోగించే దరఖాస్తు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం..

జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరుగుతుంది. కార్యక్రమంలో జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి హాజరు కానున్నారు.

తోటపల్లికి చేరిన విగ్రహాలు

- ప్రతిష్ఠకు ముమ్మరంగా ఏర్పాట్లు

గరుగుబిల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాల పరిధిలో ప్రతిష్ఠకు విగ్రహాలు శుక్రవారం ఇక్కడికి చేరుకున్నాయి. తిరుమల తిరుపతిలో తయారు చేసిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి విగ్రహాలకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ స్వాగతం పలికారు. విగ్రహాలను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ ఉభయ దేవస్థానాలలో ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కుంభాభిషేకంతో పాటు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలను దేవదాయశాఖ, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్‌లు సంయుక్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. 7న పుష్పగిరి పీఠాధిపతి జగద్గురువులు శంకరభారతిస్వామి ఆశీస్సులతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.



తిరుపతి నుంచి తోటపల్లికి తీసుకువచ్చిన విగ్రహాలు



భక్త జన సందోహం నడుమ విగ్రహాలను దించుతున్న దృశ్యం

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

సీతంపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు సూచించారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సీతంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో చిన్నబాబు మాట్లాడుతూ బాలికలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించడానికి అందరూ తోడ్పాటు అందించాలని సూచించారు. బాలికా విద్య కోసం కృషి చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించుకునే బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఎంపీడీవో కె.గీతాంజలి, డిప్యూటీ ఈవో, జీసీడీవో రాములమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థినులు

పరాక్రమానికి మారుపేరు బొబ్బిలి యుద్ధం

- ఎమ్మెల్యే బేబీనాయన
- తాండ్రపాపారాయుడికి ఘన నివాళి

బొబ్బిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి యుద్ధం పౌరుష, పరాక్రమాలకు మారుపేరుగా నిలిచిందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బొబ్బిలి యుద్ధంలో విజయరామరాజును హతమార్చిన తాండ్రపాపారాయునికి రాజవంశీయులు, ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడులు శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి నివాళులు అర్పించారు. స్థానిక బజారు సెంటరులో గల తాండ్రపాపారాయుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. తొలుత భైరిసాగరం చెరువు గట్టుపై గల యుద్ధ స్మారక స్తంభం వద్ద వీరులకు స్మృత్యంజలి ఘటించారు. బొబ్బిలి కోట తూర్పుదేవిడి ముందు గల ఆఖరి పట్టాభిషిక్తుడైన రాజా రంగారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ కేవలం 250 మంది సైనికులు వీరోచితంగా 15 వేల మంది శత్రు సైనికులతో తలపడినందునే అది చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన బీసీ కులాల రాష్ట్ర నేత మాకిరెడ్డి భాస్కరరావు, వెంకటగిరికి చెందిన చేనేత కార్మిక ప్రతినిధులు, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు రాంబార్కి శరత్ బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు, నంబియార్ వేణుగోపాలరావు, గంటి గోపాలకృష్ణ శర్మ, సుంకరి సాయిరమేష్, నంది హరి, పసుపురెడ్డి లక్ష్మణరావు, సాలా వసంత్ తదితరులు పాల్గొన్నారు.



తాండ్రపాపారాయుడి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బేబీనాయన, తెంటు

మూడు నెలల్లో కొత్త పింఛన్లు

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలనలో అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 65.50 లక్షల పింఛన్‌దారులు ఉండగా అందులో 8 లక్షల మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారన్నారు. గత ప్రభుత్వం అనర్హులకూ పింఛన్లు మంజూరు చేసిందన్నారు. నకిలీ సదరం సర్టిఫికెట్లు సృష్టించి ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. ఇటీవల నిర్వహించిన పల్స్ సర్వేలో ఆ విషయం తేలిందన్నారు. 10 వేల మందిలో 500 మంది వరకు అనర్హులు ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. దివ్యాంగుల పింఛన్లలో 5 శాతం అక్రమాలు, అవినీతి జరిగినట్టు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో అర్హులందరికీ న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు గతంలో చిన్న చిన్న సాంకేతిక కారణాల వల్ల అర్హులు పింఛన్ పొందలేని పరిస్థితులు తలెత్తాయన్నారు. పింఛన్ల పునఃపరిశీలన అనంతరం మూడు నెలల్లో కొత్తవారికి రేషన్ కార్డు ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. త్వరలో కొత్తరేషన్ కార్డుల జారీ ప్రక్రియకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామానికి చెందిన పడాల అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.10లక్షల చెక్‌ను ఆయనకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యురాలు, మాజీమంత్రి పడాల అరుణ, పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, పి.వి.వి. గోపాలరాజు, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మునకాల జగన్ పాల్గొన్నారు.



చెక్‌ను అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజలకు అందుబాటులో ఉండండి

●దత్తిరాజేరు: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరాలకు రక్షిత తాగునీటి సరఫరాకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. రీసర్వే సక్రమంగా చేపట్టాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకంలో ఎక్కువ పనిదినాలు కల్పించి గరిష్ట వేతనం పొందేలా చూడాలన్నారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లోని శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగరాదన్నారు. బాడంగి మండలం పాల్తేరు గెడ్డ వద్ద ఇసుక తవ్వకాలు ఎక్కువ అవ్వడం వల్ల నీటి సమస్య ఎదురవుతోందని మంత్రి వద్ద సంబంధిత అధికారులు తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో చరవాణిలో సంప్రదించి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో వైవి.రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ పి.విజయ భాస్కర్, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి పాల్గొన్నారు.

28న పైడిమాంబ అవతరణ దినోత్సవం

విజయనగరం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి అవతరణ దినోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నట్టు పైడిమాంబ దీక్షాపీఠం ప్రతినిధి ఆర్.సూర్యపాత్రో తెలిపారు. అమ్మవారి పెద్ద చెరువులో ఆత్మార్పణ చేసుకుని దైవంగా మారిన సందర్భంగా ఏటా జనవరి 28న అవతరణ దినోత్సవాన్ని ఆలయ అధికారులు, అర్చకులు, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఫీజు దోపిడీపై నిరసన

విజయనగరం దాసన్నపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని నారాయణ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులను ఫీజు పేరుతో వేధిస్తున్నాయన్నారు. కళాశాలల యాజమాన్యాలు దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రవికుమార్, జగదీశ్, రమేష్, సమీర, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు పురస్కారం

రాజాం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సహాయ ఎన్నికల అధికారిగా రాజాం తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఎంపికయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ పురస్కారం ప్రకటించింది. శనివారం అమరావతిలో పురస్కార ప్రదానం చేయనున్నారు. పురస్కారానికి తహసీల్దార్ ఎంపిక కావడంపై డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ డీటీ అనంతరావు, ఎన్నికల డీటీ ప్రకాశ్, సిబ్బంది అభినందించారు.

రెవెన్యూ వినతులపై ఆడిట్

రాజాం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన వినతులపై మండల ప్రత్యేకాధికారి ఎల్.జోషఫ్ శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించారు. ప్రతీ అర్జీని ఆయన పరిశీలించారు. ఈ అర్జీల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్వయంగా గ్రామాలకు వెళ్లి రైతులు ప్రజలు ఇచ్చిన అర్జీలలో వాస్తవం ఉందా లేదా అనే విషయంపై పరిశీలించి తక్షణమే సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

కాపులను బలోపేతం చేయాలి

రాజాం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపులను బలోపేతం చేసేలా కృషి చేయాలని తూర్పుకాపుల వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబ నాయుడుకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మంత్రిని సాయిబాబనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇజ్జిరోతు శ్రీనివాసరావు. జి.గోపి తదితరులు ఉన్నారు.

చీపురువలసలో రీసర్వే

కొత్తవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూముల రీసర్వే కార్యక్రమం ప్రారంభమైందని తహసీల్దార్ బి.నీలకంఠరావు తెలిపారు. కొత్తవలస పంచాయతీ చీపురువలస రెవెన్యూ గ్రామంలో శుక్రవారం నుంచి రీసర్వే ప్రారంభించామన్నారు. సర్వే నేపథ్యంలో రైతులు సహకరించాలన్నారు.

కిచెన్ గార్డెన్ తప్పనిసరి

వేపాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబోధన చేయాలని ఎంఈవో-1 నాగభూషణం ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ తప్పనిసరి అన్నారు. ఎంఈవో-2 బాలభాస్కరరావు మాట్లాడుతూ జీవో 117 ఉపసంహరణపై అవగాహన కల్పించారు.

ఉత్సవాలు ప్రారంభం

కొత్తవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి : మండలంలోని కొండడాబాకు సంబంధించి వ్యాకులమాత నవదిన జప కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. కొండడాబా చర్చి ఫాదర్ జి.రాజు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఫిబ్రవరి 1 వరకు వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు భక్తులకు సందేశాలను అందించనున్నారు.

డ్రైవర్లకు నేత్ర పరీక్షలు తప్పనిసరి

విజయనగరం క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లకు కంటి చూపు, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరని రవాణాశాఖ ఉప కమిషనర్ డి.మణికుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శివరామగోపాల్, వెంకటరావు, ఉష, శ్రావ్య పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

రేగ పుణ్యగిరి రోడ్డుకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట/వేపాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రేగ పుణ్యగిరి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కలెక్టర్ అంబేడ్కర్ భూమి పూజ చేశారు. ఈనెల 17న గ్రామ సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్‌ను స్థానిక గిరిజనులు రోడ్డు నిర్మించాలని కోరారు. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పుణ్యగిరి ఆలయం సింహద్వారం నుంచి ఈ గిరిజన గ్రామం వరకూ రోడ్డును నిర్మించేందుకు రూ.4 కోట్లు ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఒబ్బిన సత్యనారాయణ, సన్యాసినాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, కొణదం మల్లేశ్వరరావు, రెడ్డి వెంకన్న, కాపుగంటి శ్రీనివాసరావు, వాకాడ భరత్, పొట్నూరు సాయిరాం, రాయవరపు చంద్రశేఖర్, నానిగిరి రమణాజీ, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ప్రయోజనం

కొత్తవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో నిర్మాణం చేసిన జడ్పీ వాణిజ్య సముదాయం చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం ఉదయం కొత్తవలస సంతమార్కెట్ సమీపంలో నూతన భవనాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతమార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, కొత్తవలస సర్పంచ్ మచ్చరామస్వామి, గొరపల్లి రాము పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండండి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దుకాణాలు, వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన మొత్తాన్ని తక్షణమే ఫోన్‌పే ద్వారా చెల్లించాలంటూ ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి కాల్స్ వస్తున్నాయని, అటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఒక అజ్ఞాత వ్యక్తి 63052 70329 నెంబరుతో ఫోన్ చేస్తూ 8121915231 నెంబరుకు ఫోన్‌పే చేయాలని చెప్పినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి తప్పుడు ఫోన్ కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లకు సొమ్ము చెల్లించమని నగరపాలక సంస్థ అధీకృత సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది మాత్రమే వస్తారని కమిషనర్ అన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

జామి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జామి ఉన్నత పాఠశాలలో 25 మంది టెన్త్ విద్యార్థులకు శుక్రవారం ఇంగ్లీష్ టీచర్ ఆల్ల రాము స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్ సాయంతో మంచి మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

జీవో 117 రద్దుకు సర్కారు సిద్ధం

చీపురుపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 117ను రద్దు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. విద్యాశాఖ పై నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంఈవోలతో ఆయన శుక్ర వారం రాజాంలోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. తలి దండ్రుల సలహాలు, అభిప్రాయాలు పరిగణనలోని తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

కార్యకర్తల జోలికి వస్తే సహించం

దత్తిరాజేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల జోలికి వైసీపీ నేతలు వస్తే సహించేదిలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చినచామలాపల్లిలో ఇటీవల జరిగిన ఘర్షణలో గాయాల పాలైన టీడీపీ కార్యకర్తలను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు చేసే నీచ సంస్కృతి వదిలి ప్రజల్లోకి రావాలన్నారు. ఏడుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలపై దాడి ఘటనపై ఎవరికి భయపడకుండా పోలీసులు దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

మార్క్‌ఫెడ్ అభివృద్ధికి సహకరించండి

భోగాపురం, జనవరి24 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ అభివృద్ధికి సిబ్బంది సహకరించాలని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోత్రు బంగార్రాజు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో డైరెక్టర్ అన్నెపు రామకృష్ణనాయుడు, డీఎం ఉమాపద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోత్రు

రూ.300 వేతనం అందేలా చూడండి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు సగటు వేతనం రూ. 300 అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ అన్నారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజన్‌లో ప్రతి పంచాయతీలో చేపల పెంపకం కోసం కనీసం ఒక పాండ్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కమిషనర్ సునీత మాట్లాడుతూ పనులకు కొలతలు వేయడం, రిజిస్టర్లు నిర్వహించడంపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలోని డ్వామా పీడీ శారద ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ప్రసాద్

3న సామూహిక అక్షరాభ్యాసాలు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లోని ప్రసిద్ధ జ్ఞానసరస్వతి ఆలయంలో వచ్చేనెల 3న వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు శారద సేవాసంఘం ఉపాధ్యక్షుడు జి.శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో వేడుకకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

రూ.11.15 కోట్ల నష్టపరిహారం పంపిణీ

గంట్యాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):కొన్నేళ్లుగా మృతి చెందిన పశువులకు రూ.11.15 కోట్లను 3725 మంది రైతులు ఖాతాలకు జమ చేయడం జరిగిందని పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని బోనంగిలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 6న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పాడి పశువులు పాల పోటీల్లో రైతులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ రెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ రకాల వ్యాపార సంస్థలపై తూనికలు, కొలతలు శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో తూనిక యంత్రాల్లో సీల్ లేకపోవడాన్ని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతి

క్రైం కార్నర్

ఆనందపురం/ గరివిడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఆనందపురం సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా గరివిడి సమీపంలోని కందిపేట గ్రామానికి చెందిన మీసాల నాని (20) మధురవాడ సమీపంలో ఉన్న గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రైవేట్ వసతి గృహంలో ఉంటున్న నాని శుక్రవారం తన స్నేహితులు అయిదుగురితో కలిసి గంభీరం రిజర్వాయర్‌కు వచ్చాడు. అందరూ ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లోకి దిగగా నాని ఒక్కసారిగా మునిగిపోవడంతో స్నేహితులు కాపాడండి అంటూ గట్టిగా కేకలు వేశారు. సమీపంలో ఉన్న స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సురేశ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి స్నేహితులను వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. మృతుడు నాని తండ్రి దాలినాయుడు, విజయలక్ష్మి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. నానికి ఒక చెల్లి ఉంది.

అనుమానాస్పదంగా ఉద్యోగి..

సాలూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న తుపాకుల శివశంకర్ (27) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణంలోని వేగావతి బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న శివశంకర్‌గా గుర్తించారు. మృతుడికి తల్లి మంగమ్మ, చెల్లి ఇందులు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధం

జామి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీతలపాలెం గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బైక్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ఏరియాకు చెందిన వక్తి విజయనగరం వైపు వెళ్తుండగా.. అదే సమయంలో విజయనగరం నుంచి ఎస్.కోట మండలం తిమిడి గ్రామానికి చెందిన తండ్రి కూతుర్లు ద్విచక్రవాహనంపై వెళ్తూ.. పీతలపాలెం వద్దకు వచ్చేసరికి వీరి బైక్‌లు రెండూ ఢీకొన్నాయి. ప్రమాదంలో వారికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే భీమసింగి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్ కిందపడి వెంటనే దగ్ధమైంది.

బైకు, సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

దత్తిరాజేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారుగంజి రోడ్డు జంక్షన్ జాతీయ రహదారిపై బైకు, సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ వివరాల మేరకు రామభద్రపురం వైపు నుంచి గజపతినగరం వైపు వెళుతున్న బైకు షికారుగంజి రోడ్డు జంక్షన్ వద్ద సైకిల్‌ను తప్పించబోయి ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో బైకుపై వెళుతున్న భార్యభర్తలు బి.ప్రదీప్, నజామాబేగంలకు గాయాలైనట్టు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ మండలం కోనాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బుత్తల శ్రీనును శుక్రవారం అరెస్టు చేసి, అతడి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. అనంతరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ భోగాపురం స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో హెచ్‌సీ సుదర్శన్, ఈసీలు నాయుడు, జనార్దన్ పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి అపస్మారకంలోకి..

గుమ్మలక్ష్మీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ బుడెమ్మఖర్ల గ్రామానికి చెందిన పొదిలాపు పారయ్య (ఉపేంద్ర) శుక్రవారం గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబీకులు గమనించి, కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఉపేంద్ర అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మానసిక స్థితి సరిగ్గా లేనందున గడ్డి మందు తాగినట్టు కుటుంబీకులు తెలిపారు.

మృత్యువాత పడుతున్న నాటుకోళ్లు

గరివిడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పది రోజుల నుంచి గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో నాటు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అప్పటి వరకూ తిరుగుతున్న నాటు కోళ్లు ఒక్కసారి గా కుప్పకూలి మృతి చెందు తున్నాయి. దీంతో నాటు కోళ్ల పెంపకం దారులకు నష్టం వాటిల్లుతోంది. కోళ్ల మృతిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదైనా పురుగు మందు తినడం వల్ల చని పోతున్నాయా.. లేకా ఏదైనా వ్యాధి సోకడం వల్ల మృతివాత పడుతున్నాయా అనేది తెలియడంలేదు. అధికారులు కోళ్ల మరణాల నివారణ అవసరమైన మందులు పంపిణీ చేయాలని పెంపకందారులు కోరుతున్నారు.



మృతిచెందిన కోళ్లను చూపుతున్న దృశ్యం

మంత్రి హామీతో విధుల్లోకి సర్వే ఉద్యోగులు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీతో సర్వేశాఖ ఉద్యోగులు శుక్రవారం విధుల్లో చేరారు. జిల్లాలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియ మొదలుపెట్టారు. ఈనెల 18న నిర్వహించిన సమీక్షలో కలెక్టరు, జేసీ తమను కించపరిచేలా మాట్లాడారంటూ సర్వే శాఖలో ఉద్యోగులు 20 తేదీ నుంచి పెన్‌డౌన్ చేస్తున్న విషయం తెలిసిందే.

ప్లాస్టిక్ వస్తువుల స్వాధీనం

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయ దుకాణాలపై నగరపాలక సంస్థ సిబ్బంది శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. భారీ మొత్తంలో ప్లాస్టిక్ సరుకులను స్వాధీనం చేసుకున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో ప్రజా రోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది నగరంలో దాడులు నిర్వహించారు. 425 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.25 వేలు జరిమానా విధించారు.

గ్రంథాలయ నిర్వహణ కష్టతరం

●పంచాయతీల నుంచి వసూలు కాని సెస్‌లు

●చెల్లింపు విషయంలో దృష్టిపెట్టని అధికారులు

గజపతినగరం, జనవరి23(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు నిధులు రాకపోవడంతో గ్రంథాలయ నిర్వహణ కష్టతరంగా మారుతోందని సంబంధిత అధికారులు అంటున్నారు. స్థానిక శాఖ గ్రంథాలయానికి నిత్యం 60 నుంచి 70 మంది పాఠకులు వస్తుంటారు. అయితే వారికి అవసరమైన పుస్తకాలు కొనుగోలుకు ఇక్కడ అవకాశం లేకుంది. దీంతో పాఠకులు అసంతృప్తి చెందుతున్నారు. ఇళ్ల పన్ను వసూళ్లలో 8 శాతం గ్రంథాయాలకు సెస్ రూపంలో చెల్లించాల్సి ఉంది. అయితే సెస్ చెల్లింపులపై అధికారులు దృష్టిసారించకపోవడంతో గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాల కొనుగోలుకు ఆస్కారం లేకుండా పోతోంది. మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. ఇంటి పన్ను వసూలు చేసి అందులో 8 శాతం గ్రంథాలయానికి సెస్ రూపంలో చెల్లించాలి. కానీ అందు భిన్నంగా జరుగుతోంది. 2019 నుంచి 2024 వరకు సెస్‌లు చెల్లింపులు అరకొరగా జరిగాయి. ఎంచాయతీ సర్పంచ్‌ల పాలనలో బకాయిలు చెల్లింపుల విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు చూపకపోవడం శోచనీయం. ఏటా ఇంటి పన్ను కట్టించుకున్న అధికారులు గ్రంథాలయాలకు సెస్‌లు చెల్లించడంలేదు. గ్రంథాలయ శాఖ అధికారులు సైతం దీన్ని పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. 2018-19 సంవత్సరానికి సంబంధించి గజపతినగరం పంచాయతీ నుంచి రూ.60 వేలు మాత్రమే సెస్ రూపంలో వచ్చినట్లు గ్రంథాలయ అధికారులు అంటున్నారు. 2019-20, 2020-21, 2021-22కి సంబంధించి పూర్తిస్థాయిలో సెస్‌ల చెల్లింపులు జరగలేదని, అలాగే 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబం ధించిన సెస్‌ల చెల్లింపుల ఊసేలేదని సమాచారం. పురిటి పెంటతో పాటు పలు పంచాయతీలకు సంబంధించి సెస్‌లు చెల్లింపులు కాకపోవడంతో పాఠకులకు అవసరమైన పుస్తకాలు సమకూరే పరిస్థితి లేకుంది. రూ.లక్షల ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు. గ్రంథాలయ సెస్‌లు సక్రమంగా చెల్లిస్తే వాటి నిర్వహణ సులభతరమవుతుందనేది పలువురి మాట.



గజపతినగరంలోని శాఖా గ్రంథాలయం

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించండి

పంచాయతీల నుంచి గ్రంథాలయానికి రావల్సిన సెస్‌ల బకాయి ఉంది. అధికారులు స్పందించి గ్రంథాలయానికి రావల్సిన సెస్‌లను చెల్లిసే మేలు.

- స్వప్న, గ్రంథాలయశాఖ అధికారి

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

సీతానగరం, జనవరి24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం కృష్ణరాయపురంలో ఆయన పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పాడి రైతులకు ఊతమిచ్చేలా గోకులాల షెడ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. పశు కిసాన్ రుణ కార్డులను అందజేసి లక్షా అరవై వేల వరకు ఎటువంటి హామీకత్తులు లేకుండా పశు పోషణ నిర్వహణ, పశుగ్రాసాలు కోసం జీరో వడ్డీతో రుణాలను అందిస్తోందని తెలిపారు. సహాయక సంఘ సభ్యులకు పశువుల కొనుగోలుకు సుమారు రూ.30వేలు సహాయాన్ని అందజేస్తున్నట్టు చెప్పారు. వెంకటసాగరం నుంచి రాంకోనేరు వరకు ఆక్రమణలు తొలగించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, ఎంపీపీ బలగ శ్రీరాములనాయుడు, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, సర్పంచ్ అన్నంనాయుడు, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీడీవో త్రివిక్రమ్, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

జైవిక్ అవార్డు గ్రహీతకు అభినందన



రవీంద్రను సన్మానిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం/ సీతంపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేసి జైవిక్ ఇండియా అవార్డు దక్కించుకున్న గిరిజన యువకుడు ఆరిక రవీంద్రను కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శుక్రవారం అభినందించారు. సీతంపేట మండలం దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర ప్రకృతి విధానంలో వివిధ పంటలను సాగు చేసినందుకు గాను రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఏపీ తరఫున ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు ఐసీసీ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ ద్వారా రవీంద్రకు ఢిల్లీలో ఈనెల 22న అవార్డు ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న రవీంద్రను పార్వతీపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్ సన్మానించారు. గిరిజన యువత వ్యవసాయ రంగంలో రాణిస్తున్న రవీంద్రను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఆయనతో పాటు డీపీఎం పి.షణ్ముఖరాజు, ఎస్ఎఫ్ఏ వై.తిరుపతిరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్ క్రీడాకారులకు..



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే జగదీశ్వరి అభినందించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె అథ్లెటిక్స్ క్రీడాకారులను శాలువతో సన్మానించారు. ఉమ్మడి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ కోచ్ సీహెచ్ రామచంద్రరావు, క్రీడాకారులు శ్రీనివాసరావు, మోహన్‌రావు, జయరాం, సోమేశ్వరరావు, దొరబాబు, రాంప్రసాద్, చంద్రరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, రాజు, వేణుకుమార్ తదితరులు ఉన్నారు.

మన్యం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే బేబీనాయనను పలకరిస్తున్న డీవీజీ శంకరరావు

బొబ్బిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అందమైన మన్యం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు సూచించారు. బొబ్బిలి యుద్ధం జరిగిన రోజును పురస్కరించుకుని శుక్రవారం ఆయన బొబ్బిలి కోటకు విచ్చేశారు. కోటలో గల మ్యూజియంను సందర్శించారు. బొబ్బిలి యుద్ధంలో అశువులు బాసిన అమర వీరులందరికీ నివాళులు అర్పించారు. రాజవంశీయులైన ఎమ్మెల్యే బేబీనాయనను ఆప్యాయంగా పలకరించారు. ఈసందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని విజయనగరం, బొబ్బిలిలో చారిత్రక కట్టడాలు ఉన్నాయని, మన్యం ప్రాంతంలో ప్రకృతి అందాల జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని అన్నారు. వీటన్నిటినీ సర్క్యూట్‌గా గుర్తించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని అన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి

బెలగాం, 24 జనవరి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో విద్యారంగ పరిణామాలు- మన ఊరు మన బడిపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.117తో పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, దానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రాథమిక విద్యారంగాన్ని మరింత కూనరిల్లేలా చేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీ పాఠశాలలను కొనసాగించాలని, పాఠశాల సహాయకులను కేటాయించాలని కోరారు. అన్ని పాఠశాల్లో సమాంతరంగా తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు నిర్వహించాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలలో 6 నుంచి 12 తరగతులు కొనసాగించి పీజీటీలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కుర్రా భాస్కరరావు, ఎస్ఎఫ్, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కురుపాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలు కట్టుబడి ఉండి పెంచిన కూలీ రేట్లు వర్తింపజేయాలని హమాలీలు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసారు. శుక్రవారం స్థానిక జీసీసీ గోదాంలో పౌర సరఫరా సంస్థలో పనిచేస్తున్న హమాలీలకు ప్రభుత్వం ఇటీవల పెంచిన కూలీ రేట్లు వెంటనే అందజేసి, ఏరియర్స్ అందించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున నిరసన చేపడతామని తెలిపారు.

ఏనుగులను తరలించండి

కొమరాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కళ్ళికోట గ్రామంలో గల పంటలను ఏనుగుల గుంపు గురువారం రాత్రి నాశనం చేసింది. తనకు ఉన్న రెండెకరాల్లో బొప్పాయి, కీర దోస, పండ్ల తోటలను ధ్వంసం చేసినట్టు బొద్దాన నారాయణరావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించేలా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని ఆయన కోరారు.

ఆఖరి మజిలీలోనూ అవస్థలే..

● శ్మశానవాటికలో కానరాని సౌకర్యాలు

● ఇబ్బంది పడుతున్న గోపాలరాయుడుపేట గ్రామస్థులు

బొబ్బిలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గోపాలరాయుడుపేట గ్రామంలో శ్మశానవాటికలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఆ గ్రామస్థులు దహన సంస్కారాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వస్తే కనీసం నిలబడేందుకు స్థలం గానీ, షెడ్ గానీ లేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రుద్రభూమిని బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చాలా వరకు చెరువు గర్భంలో ఉన్న ఈ శ్మశానవాటికకు సరైన రహదారి సౌకర్యం లేదు. పొలం గట్టుపై నుంచే అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తుంది. దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఆ ప్రాంతంలో షెడ్డు, స్నానం చేసేందుకు బోరు బావితో నీటి సౌకర్యం, కనీస వసతులు కల్పించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



కనీస వసతులు లేని శ్మశానవాటిక

ఘనంగా బాలికా దినోత్సవం

● బేటీ బచావో- బేటీ పడావో నినాదంతో ర్యాలీలు

సీతంపేట రూరల్, సాలూరు/రూరల్, మక్కువ, భామిని, బొబ్బిలి/ రూరల్, జనవరి 24: జాతీయ బాలికా దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. బేటీ బచావో- బేటీ బడావో అంటూ నినాదాలు చేశారు. వివిధ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ● పాచిపెంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సరాయివలస గిరిజన బాలికల ఆశ్రమ సంక్షేమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో బేటీ బచావో - బేటీ పడావో అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఏకలవ్య పాఠశాల నిర్మాణం పూర్తి చేసి అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వసతి, భోజన సౌకర్యాలపై విద్యార్థులను అడిగి కాసేపు వారితో ముచ్చటించారు. ● కొమరాడ: జాతీయ బాలికా దినోత్సవాన్ని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఈవో ఎం.తిరుపతి నాయుడు, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ హాజరయ్యారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా బాలికలకు దోమ తెరలు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు, ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి సంధ్యారాణి



బొబ్బిలి: బాలికా దినోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, డీఎస్పీ భవ్యరెడ్డి

నేడు జిల్లా కేంద్రంలో ..

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం లయన్స్ కల్యాణ మండపంలో శనివారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించనున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి టి.కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా స్థాయి బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహి స్తామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ప్రజాప్ర తినిధులు, ఇతర అధికారులు పాల్గొంటారని ఆమె తెలిపారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

● టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం

బొబ్బిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టౌన్ ప్లానింగ్ విభాగంలో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల టౌన్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, టీపీవో, లైసెన్స్‌డ్ టెక్నికల్ ప్లానర్స్‌తో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణాలు చేపడుతున్న ప్రతి యజమాని అన్ని రకాల అనుమతి పత్రాలను బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో, సచివాలయాల్లో ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ రిజిస్టర్, అంక్రోచ్‌మెంట్ ట్యాక్స్, అనధికార నిర్మాణాల రిజిస్టర్, డైలీ అప్‌డేట్ భవనాల రిజిస్టర్లతో పాటు టూర్ డైరీలను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు ప్రతిరోజూ తమ పరిధిలోని క్లస్టర్‌లలో ఆస్తిపన్ను, కొళాయి పన్నులను వసూలు చేయాలని, అధికారికంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ సమాచారం ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఖాళీ స్థలాల పన్ను లేకుండా లైసెన్స్‌డ్ టెక్నికల్ ప్లానరులు ప్రతిపాదించవద్దని ఆమె ఆదేశించారు. నిర్మాణాలకు అనుమతి పొందే ముందు తప్పనిసరిగా ఖాళీ స్థలం పన్నును పూర్తి స్థాయి లో చెల్లించకుండా ప్లాన్ కోసం దరఖాస్తులు పంపితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్, లేఅవుట్‌ల అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి నెలాఖరు వరకు గడువు ఉన్నందున వారు చెల్లించాల్సిన రుసుం బకాయిల న్నిటినీ వెంటనే చెల్లించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో టీపీవో రేవతి, ఇతర సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

సీతంపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లుపై శుక్రవారం సీతంపేటలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఏపీవో చినబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

జియ్యమ్మవలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లన్నీ మార్చి 31లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు లబ్ధిదారులను కోరారు. శుక్రవారం ఆయన అర్నాడ పంచాయతీ బిల్లమానుగూడ గ్రామ గిరిజన లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలో లింటల్ లెవెల్‌లో 67, రూఫ్ లెవెల్‌లో 143, రూఫ్ కంప్లీటెడ్‌లో 323.. మొత్తం 533 ఇళ్లు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఇళ్లన్నీ మార్చి 31లోగా పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా ఇళ్లు మంజూరు కోసం ఆవాస్ 2.0 సర్వే ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగుస్తుందని తెలిపారు. ఇదివరకు ఇళ్ల కోసం నమోదు చేసుకున్న వారు కుల, ఆదాయ, పొజిషన్ ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరారు. ఈయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ ఉన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

పాలకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసనగా ఈనెల 26న నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలో ఏపీ రైతు సంఘం, కార్మిక సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన పంటకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం, ఆహార భద్రతా చట్టం కొనసాగించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, పాపారావు, కె.గోవింద, ఎం.విజయ్‌కుమార్, వై.శ్రీనివాసరావు, సంజీవి, నారాయణరావు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాలకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాపరావు అన్నారు. ఆయన శుక్రవారం పాలకొండలోని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 19వార్డులో సమస్యలను నమోదు చేసుకున్నారు. కస్పా వీధిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీనిచ్చారు. ఆయన వెంట నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

సాలూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సాలూరులో పీటీడీ(ఆర్టీసీ) కార్మికులు శుక్రవారం ర్యాలీ చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శించారు. నీడ్ ఎండీ వేణుగోపాలరావు, పీటీడీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

బెలగాం, 24 జనవరి (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఏఎస్పీ ఓ.దిలీప్ కిరణ్ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయనకు 20 ట్రాఫిక్ స్టాపర్లను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాపర్లు దోహదపడుతున్నామన్నారు. ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, పార్వతీపురం సీఐ మురళీధర్, పట్టణ సీఐ ఆర్ఐ నాయుడు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. వసతి కరువు

(ఐదో పేజీ తరువాయి)

పొల్ల, బగ్గ, బత్తిలి, భామినిలో వెటర్నరీ అసిస్టెంట్లు లేరు.

● జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ లేరు.

● పశు సంవర్ధకశాఖకు సంబంధించి 39 పోస్టులు ఖాళీగా ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

జిల్లాలో పశు సంవర్ధక శాఖకు సంబంధించి పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాం.

- ఎస్.మన్మథరావు, జేడీ, పశు సంవర్ధక శాఖ, పార్వతీపురం మన్యం

జిల్లాలో ఉన్నవి		రిపేర్లు చేయాల్సిన భవనాలు	శిథిలావస్థలో ఉన్నవి	బాగున్న భవనాలు
పశు వైద్యశాలలు	07	01	05	01
పశు వైద్య చికిత్సాలయాలు	38	18	14	06
గ్రామీణ పశు యూనిట్లు	35	22	09	04
మొత్తం	80	41	28	11

జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు

సీతంపేట రూరల్, జనవరి 24(ఆంధ్ర జ్యోతి): గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను సీతంపేట గిరిజన సహకార సంస్థ ద్వారా కొనుగోలు చేయడం ప్రారంభించారు. వారపు సంతల్లోనే కాకుండా జీసీసీ బీఎం కృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది గిరిజన గ్రామాలకు వెళ్లి, ఉత్పత్తుల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గిరిజనులు పండించే ఫలసాయలైన చింతపండు, కొండచీపుర్లు, నల్లజీడి పిక్కలు, కరక్కాయలను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు కొనుగోలు చేస్తామని బీఎం వివరించారు. అటవీ ఉత్పత్తులకు జీసీసీ ప్రకటించిన ధరలను కూడా గిరిజన రైతులకు పట్టిక చూపుతూ వివరించారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్, ఎండీ ఆదేశాల మేరకు గిరిజన ఉత్పత్తు లను సరైన గిట్టుబాటు ధరతో రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు జీసీసీ సిద్ధంగా ఉందని బీఎం చెప్పారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం గుర్రపువలస రెవెన్యూ పరిధిలో ఉన్న దళితులు గత 50 ఏళ్లగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, మర్రి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దళితులకు పట్టాలు ఇవ్వకుండా ఆటంకం కలిగిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూములను కాజేసేందుకు ఒక వ్యక్తి ప్రయత్నిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ శోభిక

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్యాంప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మన్యం జిల్లాకు చెందిన అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీవో హేమలత, డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీసీహెచ్‌వో వాగ్దేవీ, పీడీ రామచంద్రరావు, డపీఆర్వో రమేష్, వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్త్రీనిధి రుణాలపై విచారణ

బొబ్బిలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముత్తావలస గ్రామంలో స్త్రీనిధి రుణాలపై వచ్చిన ఫిర్యాదులపై ఏపీఎం ఉమామహేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. సభ్యులను పిలిపించి విచారిస్తుండగా వారి భర్తలు జోక్యం చేసుకుని గొడవకు దిగారు. గ్రామస్థుల ప్రోద్భలంతో పరిస్థితి సద్దుమణిగింది. మరోసారి విచారణకు జిల్లా కేంద్రం నుంచి ఒక బృందాన్ని పంపిస్తామని వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి తెలిపారు. వెలుగు సీసీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

రామభద్రపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ సులోచనారాణి కోరారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్క రించుకుని, శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందించారు. ఎంఈవో తిరుమలప్రసాద్ పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాలతో రికార్డు

రామభద్రపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలోనే టీడీపీ కోటి మందికిపైగా సభ్యత్వాలు నమోదుచేసి రికార్డు సాధించిందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు అన్నారు. బూసాయవలసలో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీకి ఆదరణ చెక్కు చెదరలేదని మరోసారి నిరూపించారన్నారు. రొంపల్లి ఎంపీటీసీ బి.శంకరరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

బొబ్బిలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుని అకాల మరణం పొందిన కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే బేబీనాయన ఆర్థిక సాయం చేశారు. పిరిడి గ్రామంలో ఇటీవల ముగ్గురు పార్టీ కార్యకర్తలు మృతిచెందారు. వారి కుటుంబాలకు శుక్రవారం రూ.5వేలు చొప్పున స్థానిక నాయకుల చేతులమీదుగా అందజేశారు.

స్థానికులకే డీలర్ పోస్టులు ఇవ్వాలి

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో రేషన్ డీలర్ పోస్టులను స్థానిక పంచాయతీ వారికి కాకుండా వేరే పంచాయతీ వారికి ఇచ్చారని, దీనిపై దర్యాప్తు నిర్వహించాలని ఉత్తరాంధ్ర సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నవిరి కాలనీ డీలర్ పోస్టును వేరే వార్డు అభ్యర్థికి ఇచ్చారని ఆయన ఆరోపించారు.

ఉపాధి పనులు కల్పించాలి

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వెంటనే ఉపాధి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం నాయకుడు పైడిశెట్టి జీవన్ ఆధ్వర్యంలో డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రాన్ని అందించారు.

ఉత్సవ కమిటీ నియామకంపై కృతజ్ఞతలు

మక్కువ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతర ఉత్సవ కమిటీ నియామకంపై మంత్రి సంధ్యారాణికి దేవదాయ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో జాతర విజయవంతం చేస్తామన్నారు.

పీఎం గృహ యోజన లబ్ధిదారుల ఎంపిక

ఒడిశా

రాయగడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పీఎం గృహ యోజనలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర సమితి కార్యాలయంలో జడ్పీ కార్య నిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.15వేలు లోపు ఆదాయం ఉన్నవారు ఈ పథకం అర్హులని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 273 గ్రామాలను ఎంపిక చేశామని చెప్పారు. ఆయా గ్రామాల్లో 57 మంది అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమం ఈనెల 24 నుంచి 31 వరకు కొనసాగుతుందన్నారు. సమితి అధికారి కాలుచరణ్ నాయక్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మోహన మురళి పాల్గొన్నారు.